


జిల్లా ప్రత్యేక అధికారిగా వి.వినయ్‌చంద్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాల్లో ప్రభుత్వ కార్యక్రమాలను పర్యవేక్షణ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించినట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ తెలిపారు. దీనిలో భాగంగా విజయనగరం జిల్లాకు యువజనాభ్యుదయం, పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి వి.వినయ్ చంద్ ను నియమించినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ శాఖల అధికారులు, జిల్లా యంత్రాంగం మధ్య సమన్వయం చేసి ప్రభుత్వ కార్యక్రమాల లక్ష్యం నెరవేరే విధంగా అమలు చేయడంలో ప్రత్యేక అధికారులు తోడ్పడతారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నట్టు వెల్లడించారు.

పచ్చదనాన్ని పెంచుదాం

- చెట్ల పెంపకం మన జీవనవిధానంలో భాగం కావాలి
- వన మహోత్సవంలో మంత్రి కొండపల్లి
- బేతనాపల్లి నగరవనంలో అటవీశాఖ ఆధ్వర్యాన వనమహోత్సవం



మొక్కకు నీరు పోస్తున్న మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యే మాధవి

ప్రజాశక్తి-డెంకాడ

జిల్లాలో అటవీ విస్తీర్ణం అతి తక్కువగా 6 శాతం మాత్రమే వుందని, రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం ప్రకారం 50 శాతం పచ్చదనం తీసుకురావాలంటే జిల్లాలో మొక్కలు నాటే కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగాలని రాష్ట్ర చిన్నపరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మొక్కలు నాటే కార్యక్రమాలను కేవలం ప్రభుత్వ స్థలాలకే పరిమితం చేయకుండా ఇళ్ల కాలనీలు, ఖాళీ స్థలాలు, ఇళ్ల వద్ద మొక్కలు నాటడం ద్వారా సామాజిక అటవీ విస్తీర్ణం పెంచుకోవలసి ఉందన్నారు. వచ్చే ఐదు సంవత్సరాల్లో ప్రతి ఏటా జిల్లాలో కనీసం 2 నుంచి 3శాతం పచ్చదనాన్ని పెంచేలా లక్ష్యాన్ని నిర్దేశించుకొని దానిని చేరుకునేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు. వనమహోత్సవాన్ని అటవీశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం డెంకాడ మండలం బేతనాపల్లి వద్ద వున్న నగరవనంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి, జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్, ఎంఎల్‌సి సురేష్‌బాబు తదితరులు పలు రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ మన పూర్వీకులు మనకు అందించిన పర్యావరణం అనే ఆస్తిని భావితరాలకు కూడా మనం అందించాలంటే దీనిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా వుందన్నారు. ఎమ్మెల్యే లోకం నాగమాధవి మాట్లాడుతూ నెల్లిమర్ల నియోజకవర్గాన్ని హరిత ప్రాంతంగా రూపొందించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇది బాధ్యతగా భావించి మొక్కలు నాటాలన్నారు. కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ మాట్లాడుతూ తాటిచెట్ల వల్ల పిడుగుల బారి నుంచి ప్రజల ప్రాణాలను కాపాడవచ్చని అందువల్ల వాటిని తొలగించకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఈమేరకు తహశీల్దార్లకు ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు. జిల్లాలో ఈ ఒక్కరోజే లక్ష మొక్కలు నాటుతున్నామని,మరో 7 లక్షల మొక్కలు సిద్ధంగా వుంచామన్నారు. జిల్లా అటవీ అధికారి ఎస్.వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో అటవీ విస్తీర్ణం 6శాతం, మొత్తం పచ్చదనం 18శాతంగా వుందని, దీనిని 50శాతంకు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. జిల్లాలో ఈ ఏడాది 50 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. ఈ సందర్భంగా సభికులందరితో జిల్లా అటవీ అధికారి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి జమదగ్ని, ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖరరావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు నారాయణ, బిజెపి నాయకులు బి.శ్రీధర్, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పల్లె భాస్కరరావు, కడగల ఆనంద్, నాయకులు సువ్వాడ రాజశేఖర్, గేదెల రాజారావు, చింతపల్లి రామ్మూర్తి, జనసేన నాయకులు పాలవలస యశస్విని, ఎంపిటిసిలు జగన్నాథం, రమేష్, ఎంపిడిఒ స్వరూప రాణి, తహశీల్దార్ వి.పద్మావతి పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత : ఎమ్మెల్యే

విజయనగరంటౌన్ : ప్రాణవాయువునిచ్చే మొక్కలను సంరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక నెహ్రూ పార్కులో మొక్కలు నాటారు. నగరపాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య, సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు మొక్కలను నాటి అందరికీ స్ఫూర్తిని నింపారు. కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ ఏడాది పాటు మొక్కలను సంరక్షించేందుకు రూ.2.40 కోట్ల రూపాయలు వెచ్చించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఒ డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, ఇఇ శ్రీనివాసరావు, పాల్గొన్నారు. జెఎన్‌టియులో విశ్వవిద్యాలయం ఇన్చార్జి విసి డి.రాజ్యలక్ష్మి, రిజిస్ట్రార్ జి.జయసుమ, డైరెక్టర్లు, కళాశాల ప్రిన్సిపాల్ , టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు కలసి మొక్కలు నాటారు.

అందరి నోట బదిలీల మాట


- సిఫార్సు లేఖల కోసం ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు
- 15 వరకు గడువు పొడిగింపుతో ఊరట

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి / పార్వతీపురం

ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగుల నోట బదిలీల మాటే వినిపిస్తోంది. ముఖ్యంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, సివిల్ సప్లయి, గనుల శాఖ, అన్ని ఇంజినీరింగ్ విభాగాలు, దేవాదాయ శాఖ ట్రాన్స్‌పోర్టు, కమర్షియల్ అండ్ ఎక్సైజ్ సహా మొత్తం 15 శాఖల అధికారులు, ఉద్యోగుల బదిలీలకు ఈనెల 17న ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిన సంగతి తెలిసిందే. నాటి నుంచి ఉన్న చోట కొనసాగేందుకు కొందరు, ఇతర స్థానాలకు వెళ్లేందుకు మరికొందరు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈనేపథ్యంలో ఎమ్మెల్యేల సిఫార్సుల లేఖల కోసం తిరుగుతున్నారు. దాదాపు అందరు ఎమ్మెల్యేలు లేఖలు ఇస్తున్నట్టుగా చర్చనడుస్తోంది. అయితే, ఇప్పటి వరకు జిల్లాలో బదిలీల ప్రక్రియ చాపకింద నీరులా సాగడమే తప్ప, ఊపందుకోలేదు. రెండు రోజుల క్రితమే విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నల్లనయ్య బాధ్యతలు స్వీకరించారు. రెవెన్యూ, గ్రామ సచివాలయాలు, మెప్మా విభాగాల్లో కసరత్తు ప్రారంభమైంది. మిగిలిన శాఖల్లో పెద్దగా మార్పులు కనిపించలేదు. వాస్తవానికి నేటి (ఈనెల 31)తో బదిలీల ప్రక్రియ పూర్తిచేయాల్సివుంది. కానీ, బదిలీల ప్రక్రియకు సమయాన్ని సెప్టెంబర్ 15వ తేదీ వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీచేయడంతో కొందరికి ఊరట, మరికొందరికి ఉత్కంఠగా మారింది. ఇప్పటి వరకు కలెక్టర్ అంబేద్కర్, అటు మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ బదిలీల విషయంలో పెద్దగా జోక్యం చేసుకోలేదని సమాచారం. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే బదిలీలు జరుగుతాయంటూ సిఫార్సుల లేఖలను సున్నితంగా తిరస్కరిస్తున్నారు. అయితే, ఆ లేఖలు ఇచ్చిన ఎమ్మెల్యేల నుంచి ఒత్తిడి వచ్చే అవకాశం లేకపోలేదు. ఆ పరిస్థితి ఏర్పడితే కలెక్టర్లు ఇద్దరూ ఎలా స్పందిస్తారో అన్నదానిపై సర్వత్ర చర్చనడుస్తోంది. వీలైనంత వరకు అధికారులు, ఇతర ఉద్యోగులను మాతృశాఖలు, సంస్థలకే పంపాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టుగా బోగట్టా. ఈనేపథ్యంలో ప్రస్తుతం డిప్యుటేషన్లపై పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగుల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంటోంది.

రైస్‌మిల్ కార్మికులకు తీవ్ర అన్యాయం

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి-రాజాం

రైస్ మిల్లు కార్మికులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ ఆవేదన వ్యక్తంచేశారు. స్థానిక డొంకల రైస్‌మిల్ వద్ద రైస్‌మిల్ కార్మికుల జనరల్ బాడీ సమావేశాన్ని శుక్రవారం సిఐటియు నాయకులు పోరెడ్డి విశ్వనాథం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ రైస్‌మిల్ కార్మికులకు ఇఎస్‌ఐ, పిఎఫ్ సౌకర్యాలు లేవన్నారు. పిఎఫ్ డబ్బులు కోత విధిస్తున్నా, వారికి పింఛను రావడం లేదని తెలిపారు. యాజమాన్యం, ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రైస్‌మిల్ హమాలీ, డ్రైవర్లు సంఘటితమై రాబోయే రోజుల్లో తమ హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు, కార్యదర్శి కె. సురేష్ మాట్లాడుతూ 50 కిలోలకు మించి బరువు ఉండకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ 100 కిలోల బరువుతో పని చేయించడం చట్టరీత్యా నేరమన్నారు. సిఐటియు నాయకత్వంలో రాజాం రైస్‌మిల్ కార్మికులు హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలని కోరారు. అనంతరం రైస్‌మిల్లు కార్మికుల నూతన కమిటీ ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా పి.శంకరరావు, అధ్యక్షులుగా పోరెడ్డి విశ్వనాథం, కార్యదర్శిగా కంచి నాయుడు, ట్రెజరర్‌గా చిట్టి నాయుడుతోపాటు ఏడుగురితో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బతుకు జీవుడా..!

- మడ్డువలస రిజర్వాయరులో చేపల వేటకు వెళ్లి చిక్కుకున్న మత్స్యకారులు
- 12 గంటల తరువాత ఒడ్డుకు...



రిజర్వాయరులో గుర్రపుడెక్క మధ్య చిక్కుకున్న మత్స్యకారులు

ప్రజాశక్తి-వంగర

అది మడ్డువలస రిజర్వాయరు. సమయం.. శుక్రవారం ఉదయం 4 గంటలు. రోజూ మాదిరే జీవనోపాధి కోసం మగ్గూరు గ్రామానికి చెందిన సూరిమల్లి రాజు, సూరిమల్లి శ్రీను, గుండ్రెడ్డి పోలి, సూరిమల్లి చిన్న.. నలుగురు కలిసి పడవలపై రిజర్వాయరులో చేపల వేటకు వెళ్లారు. వేట సాగిస్తుండగా, సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి పెద్దఎత్తున గుర్రపుడెక్క రిజర్వాయరులోకి ఒక్కసారిగా చేరింది. వేటకు వెళ్లిన ఈ మత్స్యకారుల చుట్టూ గుర్రపుడెక్క చేరింది. దీంతో వారంతా బయట పడేందుకు ఎంత ప్రయత్నించిన ఒడ్డుకు చేరలేకపోయారు. ఈ విషయాన్ని ఫోన్‌లో కుటుంబ సభ్యులకు తెలిపారు. వారు అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో మడ్డువలస ప్రాజెక్టు డిఇ అర్జున్, ఎఇ నితిన్, ఎస్‌ఐ షేక్ శంకర్, డిటి సుందరరావు, ఆర్‌ఐ జామి మురళి.. రిజర్వాయరు వద్దకు చేరుకొన్నారు. పరిస్థితిని గమనించి, రెండు గేట్లు ఎత్తి దిగువకు నీరు విడిచిపెట్టారు. అనంతరం సహాయ చర్యలు ప్రారంభించారు. దీంతో గుర్రపు డెక్కలో చిక్కుకున్న నలుగురు మత్స్యకారులు శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు బతుకు జీవుడా! అంటూ ఒడ్డుకు చేరుకున్నారు. 12 గంటల అనంతరం వారంతా క్షేమంగా చేరుకోవడంతో వారి కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రభుత్వ ఐటిఐలో దందా?

1117 మంది విద్యార్థుల నుంచి రూ.16.75లక్షలు వసూళ్లు



బొబ్బిలిలోని ప్రభుత్వ ఐటిఐ

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రభుత్వ ఐటిఐలో అక్రమ వసూళ్ల దందా సాగిందా? పరీక్షా కేంద్రంగా ఐటిఐను ఎంపిక చేయడంతో అక్కడి ఉద్యోగులకు, అధికారులకు కాసుల పంట పండిందా? అంటే ఔననే సమాధానమే వినిపిస్తోంది. అక్రమార్జన రూ.లక్షల్లో ఉన్నట్లు సమాచారం. ఇలా చేసిన వసూళ్లలో కింది నుంచి పైస్థాయి వరకు వాటాలు పంచినట్లు తెలిసింది. విద్యార్థుల నుంచి అడ్డగోలు వసూళ్లకు ఓ కమిటీని ఏర్పాటు చేసి మరీ, దందాకు తెరదీయడం గమనార్హం.

బొబ్బిలి ప్రభుత్వ ఐటిఐను పరీక్షా కేంద్రంగా ప్రభుత్వం నియమించింది. ప్రభుత్వ ఐటిఐలో చదువుతున్న 425మంది, మూడు ప్రైవేట్ ఐటిఐలలో చదువుతున్న 692మంది విద్యార్థులు కంప్యూటర్ బేస్డ్ పద్ధతిలో పరీక్షలు రాసేందుకు ప్రభుత్వ ఐటిఐను పరీక్షా కేంద్రంగా ఎంపిక చేసింది. ప్రభుత్వ ఐటిఐను పరీక్షా కేంద్రంగా నియమించడంతో అక్కడ పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్టు ఉద్యోగులు సొమ్ము చేసుకునేందుకు అక్రమ వసూళ్లకు పాల్పడ్డారు. పరీక్షలలో ఉత్తీర్ణత సాధించాలంటే ఒకొక్క విద్యార్థి రూ.1,500 ఇవ్వాలని షరతు పెట్టినట్లు తెలిసింది. అలా ఇస్తే ప్రశ్నలకు సమాధానాలు చెప్పి పాస్ చేయిస్తామని, డబ్బులు ఇవ్వకపోతే జవాబులు చెప్పడం కుదరదని విద్యార్థులను భయపెట్టినట్లు సమాచారం. దీంతో ఒక్కొక్క విద్యార్థి రూ.1500 ఇచ్చినట్లు చర్చ సాగుతోంది.

ప్రాక్టికల్స్ పేరుతో రూ.8.50లక్షలు వసూలు

ప్రభుత్వ ఐటిఐలో చదువుతున్న 425మంది విద్యార్థుల నుంచి రూ.8.50 లక్షలు వసూలు చేసినట్లు తెలిసింది. ప్రాక్టికల్స్ పేరుతో ప్రభుత్వ ఐటిఐలో చదువుతున్న ఒకొక్క విద్యార్థి నుంచి రూ.2వేలు చొప్పున 425 మంది నుంచి రూ.8.50 లక్షలు అక్రమంగా వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

రూ.16.75లక్షలు వసూలు

ప్రభుత్వ ఐటిఐలో ఈ నెల 22 నుంచి 30 వరకు 8 రోజులపాటు పరీక్షలు నిర్వహించారు. రోజుకు మూడు షిప్టుల్లో ఒక్కొక్క షిఫ్టుకు 50 మంది చొప్పున రోజుకు 150మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఒకొక్క విద్యార్థి నుంచి రూ.1500 చొప్పున సుమారు రూ.16.75 లక్షలు అక్రమ వసూళ్లు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

అక్రమ వసూళ్లకు ఒక కమిటీ

ప్రభుత్వ ఐటిఐలో పరీక్షలు రాసే విద్యార్థుల నుంచి అక్రమ వసూళ్లు చేసేందుకు ఒక కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఐటిఐలో పని చేస్తున్న ఒక రెగ్యులర్ ఉద్యోగి, ఒక కాంట్రాక్టు ఉద్యోగికి అక్రమ వసూళ్ల బాధ్యత అప్పగించినట్లు చర్చ సాగుతుంది. వీరిద్దరు విద్యార్థుల నుంచి అక్రమ వసూళ్లు చేసి పరీక్షలలో ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు చెప్పే బాధ్యత సంబంధిత ట్రెయినీ మాస్టర్లకు అప్పగించినట్లు తెలిసింది. పరీక్షా సమయంలో ఆఖరి 30 నిమిషాల ముందు ట్రెయినీ మాస్టర్లు కేంద్రంలోకి వెళ్లి ప్రశ్నలకు జవాబులు చెప్పారు.

పంపకాలలో అందరికీ వాటాలు

విద్యార్థుల నుంచి అక్రమ వసూళ్ల ద్వారా వచ్చిన డబ్బుల పంపకాల్లో ఐటిఐలో పని చేసిన సిబ్బంది నుంచి రీజనల్ స్థాయి వరకు ఉన్న అధికారుల వరకు వాటాలు ఉన్నట్లు చర్చ నడుస్తోంది. అక్రమ వసూళ్ల విషయం బయటకు రాకుండా ఉండేందుకు కొంతమంది మీడియా ప్రతినిధులకు (ప్రజాశక్తి కాదు) ముడుపులు అందాయి. పెద్దమొత్తంలో డబ్బులను ఐటిఐ ఉద్యోగులు, ఉన్నతాధికారులు పంచుకున్నారని విమర్శలు వస్తున్నాయి.

సిసి కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు

ప్రభుత్వ ఐటిఐలో సిసి కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరిగినట్లు పరిశీలకులు యుగంధర్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలలో ఎటువంటి అవకతవకలూ జరగలేదని చెప్పారు.



గ్రామంలో నిరసన చేస్తున్న వృద్ధులు, వితంతువులు

పింఛన్లు తొలగించొద్దంటూ నిరసన

ప్రజాశక్తి-వంగర

అర్హులైన తమ పింఛన్లను తొలగించొద్దంటూ వంగర మండలం శివ్వాం గ్రామానికి చెందిన కొందరు వృద్ధులు, వితంతువులు ఆ గ్రామంలో శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు బొక్కేల వెంకట అప్పలనాయుడు మాట్లాడుతూ గ్రామంలో సుమారు 60 మంది వృద్ధులు, వితంతువులు వైసిపికి ఓట్లు వేశారనే ఉద్దేశంతో వారంతా అనర్హులని టిడిపి నాయకులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. దీంతో ఎంపిడిఒ త్రినాథరావు, సిబ్బంది గ్రామంలో దర్యాప్తు కోసం శుక్రవారం వచ్చారు. తామంతా అర్హులమని, ఫిర్యాదు చేసిన వారు దర్యాప్తు వద్దకు రావాలని వృద్ధులు, వితంతువులు పట్టుబట్టారు. దీంతో అధికారులు దర్యాప్తు చేయకుండా వెనుతిరిగారు.

89 మంది మహిళా సంరక్షణ పోలీసులకు బదిలీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో వివిధ గ్రామ/వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న మహిళా సంరక్షణ పోలీసుల బదిలీలకు శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి వకుల్‌జిందాల్ కౌన్సిలింగ్ నిర్వహించారు. మహిళా సంరక్షణ పోలీసుల వ్యక్తిగత, కుటుంబ ఆరోగ్యపరమైన సమస్యలను, భాగస్వామి ఉద్యోగాలను దృష్టిలో పెట్టుకొని, ప్రభుత్వ నిబంధనలు మేరకు ప్రాధాన్యత కల్పిస్తూ బదిలీలు చేపట్టారు. ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి మ్యూచువల్ బదిలీలకు కూడా అవకాశం కల్పించారు. సీనియారిటీ ప్రాతిపదికన ఒక్కొక్కరిని పిలిచి, వారితో మాట్లాడి, వారి సమస్యలను విని కోరుకున్న చోటుకు బదిలీ చేసారు. కౌన్సిలింగ్ ప్రక్రియలో ఎఎస్‌పి (అడ్మిన్) అస్మా ఫర్హీన్, సిఐలు కెకెవి విజయనాథ్, ఎ.వి.లీలారావు తదితరులు పాల్గొన్నారు.

కబ్జాల నుంచి చెరువులను కాపాడండి

అధికారులకు స్థానికుల ఫిర్యాదు

ప్రజాశకి-విజయనగరం టౌన్

నగరంలోని రోజురోజుకూ కబ్జాలకు గురవుతున్న చెరువులను కాపాడాలని చెరువుల సంరక్షణ కమిటీ సభ్యులు, ప్రజలు కోరుతున్నారు. తాజాగా కనపాక రెవిన్యూ పరిధిలోని సర్వే నెంబరు 6 మహంతి చెరువు మధ్య నుంచి రోడ్డు వేశారని, దీనివల్ల ఆపరిసర ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది ప్రజాప్రతినిధుల సహకారంతో చెరువును ఆక్రమించేందుకు కొద్దిరోజుల క్రితం చెరువులో డబ్రిస్ వేశారు. కణపాక ప్రాంతానికి చెందిన కార్పొరేటర్ కూడా నగర సంస్థ కార్యాలయానికి ఈ ఆక్రమణపై ఫిర్యాదు చేశారు. దీంతో నగర పాలక టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఆక్రమణ ను తొలగించేందుకు వెళితే వైసిపి పార్టీకి చెందిన కార్పొరేటర్లు నగర పాలక సిబ్బందిని అడ్డుకునే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. అయినప్పటికీ రోడ్డు కోసం వేసిన డబ్రిస్‌ను అధికారులు తొలగించారు. మళ్లీ నాలుగు రోజుల క్రితం రాత్రికి రాత్రి మట్టి తెచ్చి చెరువు గర్భంలోనుంచి రోడ్డు వేశారు. నగర పాలక సంస్థ కార్యాలయం నుంచి రెవెన్యూ శాఖకు కూడా ఫిర్యాదు వెళ్లినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. ఈనేపథ్యంలో చెరువుల పరిరక్షణ కమిటీ సభ్యులు కలెక్టర్‌కు, కమిషనర్‌కు, ఎమ్మెల్యేకు వినతి అందజేశారు.

ఇప్పటికే నగరంలో అనేక చెరువులు కబ్జాకు గురయ్యాయి. దాసన్నపేట ఎర్ర చెరువు, కాటవీధి నల్లచెరువు, బాబామెట్ట కొండగెడ్డ, అయ్యకోనేరు, బుచ్చన్న కోనేరు ఆక్రమణలతో చిన్నవిగా మారాయి. గెడ్డవీధి, రాజీవనగర్ మీదుగా ధర్మపురి వరకు వెళ్లే గెడ్డ.. పిల్ల కాలువగా మారి పోయాయి. ధర్మపురి చెరువు, ప్రదీప్ నగర్ చెరువులు కనుమరుగయ్యే పరిస్థితికి వచ్చాయి. ప్రేమసమాజం ఎదురుగా ఉన్న చెరువు పూర్తిగా మూత పడింది. ఊటగెడ్డ వాగు కబ్జాలు చేసి, ఇళ్ల నిర్మాణాలు చేపట్టడంతో ఊరుగా మారిపోయింది. సారిపల్లి రోడ్డులో క్వారీకొండ వాగులు కబ్జా కోరల్లో చిక్కిశల్యమైపోయాయి. ఇప్పటికైనా యుద్ధ ప్రాతిపదికన చెరువులు ఇతర నీటి వనరుల ఆక్రమణలపై చర్యలు చేపట్టాలని సంరక్షణ సభ్యులు కోరుతున్నారు.



మహంతి చెరువు మధ్య నుంచి వేసిన రోడ్డు

యుపిఎస్‌ను రద్దు చేయాలి

కలెక్టరేట్ ఎదుట యుటిఎఫ్ నిరసన



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్రప్రభుత్వం తెచ్చిన యూనిఫైడ్ పెన్షన్‌స్కీమ్ (యుపిఎస్)ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యాన శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జెఆర్‌సి పట్నాయక్ మాట్లాడుతూ ఈ యుపిఎస్ విధానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ తాము ఒప్పుకోవడం లేదని, పాత పెన్షన్ స్కీమ్‌ను మాత్రమే ఒప్పుకుంటామని చెప్పారు. ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగుల కంట్రిబ్యూషన్ ఉన్న ఈ యుపిఎస్‌ను ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోబోమని అన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు డి రాము మాట్లాడుతూ గతంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తెచ్చిన గ్యారెంటీ పెన్షన్ స్కీం లాగే కొంచెం అటు ఇటుగా యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ ఉందని, దీనివల్ల ఉద్యోగులకు ఉపాధ్యాయులకు మేలు జరగదని అన్నారు. పాత పెన్షన్ స్కీమ్‌ను మాత్రమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు సిహెచ్ తిరుపతి నాయుడు, ఎన్.సత్యనారాయణ, హెచ్‌ఎం సన్యాసినాయుడు, విజయనగరం, గంట్యాడ మండల నాయకులు పి రామకృష్ణ, గణేష్, ఎస్.వెంకట్రావు, జి మురళీమోహన్, బి శ్యామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం : కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన యుపిఎస్‌ను వ్యతిరేకిస్తూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం యుటిఎఫ్ నాయకులు నిరసన తెలియజేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి చింత భాస్కరరావు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ అల్లు శంకరరావు, రాష్ట్ర కౌన్సిలర్ కె.అప్పారావు, జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ జి.వి.నారాయణ, మండల ప్రధాన కార్యదర్శి జగదీశ్, నాయకులు శ్రీనివాసరావు, సూరిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యుపిఎస్‌ను ఎట్టి పరిస్థితిలోనూ అంగీకరించేది లేదని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జివి రమణ అన్నారు. యుపిఎస్‌ను వ్యతిరేకిస్తూ శుక్రవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం తహశీల్దార్ అరుణకుమారికి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు గూనూరు వెంకట రావు, మండల ప్రధాకార్యదర్శి ఎ.శ్రీనివాస్, మహిళా అధ్యక్షులు ఎవి లక్ష్మి, సీనియర్ నాయకులు వి. అర్జున, సిపిఎస్ ఉపాధ్యాయులు ఎ.భద్రావతి, జి.గణేష్ నాయుడు, జిపిఎ నాయుడు, పిఎన్ మూర్తి, వైభాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి : యుపిఎస్‌ను నిరసిస్తూ మండల రిసోర్స్ భవనం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. మాట్లాడుతూ కాంట్రిబ్యూషన్ లేని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్స్ ఎ.సత్య శ్రీనివాస్, గొర్లె పద్మావతి, జిల్లా గౌరవాధ్యక్షుడు మీసాల అప్పలనాయుడు, జిల్లా కార్యదర్శి సూరు శ్రీనివాసరావు, మండల ప్రతినిధులు ఎన్ బలరాం, డి కష్ణమూర్తి, మీసాల రవికుమార్, ఎం వరప్రసాద్ , వై వెంకటరమణ, కోట్ల రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి 3న ధర్నాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని, కోల్‌కత్తాలోని ఆర్‌జి కార్ మెడికల్ కాలేజ్ విద్యార్థినిపై జరిగిన హత్యాచారానికి నిరసనగా సెప్టెంబర్ 3న ఆశా డే సందర్భంగా మధ్యాహ్న భోజన విరామంలో నల్ల రిబ్బన్లతో నిరసన వ్యక్తం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి సుధారాణి, సిఐటియు నగర అధ్యక్షులు ఎ. జగన్ మోహన్ రావు పిలుపునిచ్చారు. శుక్రవారం విజయనగరం అర్బన్ ఆశా వర్కర్ల తో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన హామీలకు జీవో లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పనిభారం తగ్గించాలని, రికార్డులు ఇవ్వాలని, రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచాలని, సెలవులు ఇవ్వాలని , జీతాలు పెంచాలని , పని ప్రదేశంలో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు వేయాలని కోరుతూ ఈ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అప్పయ్యమ్మ, కనక మహాలక్ష్మి, వసంత, రేవతి, సోమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎంసి ఎన్నిక నిబంధనలకు విరుద్ధం

ప్రజాశక్తి-గజపతినగరం

కెంగువలో ప్రాథమిక పాఠశాలలో గురువారం ఎస్ఎంసి ఎన్నికలు అన్యాయంగా, నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని వైసిపి నాయకులు లెంక గణేష్, విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఆ గ్రామ సచివాలయ ఆవరణలో నిరసన తెలిపారు. కొండల దుర్గ అనే విద్యార్థిని తల్లిదండ్రులు సమీప బంధువుకు అనారోగ్యం కారణంతో వేరే ఊరికి వెళ్లారని, వారి పేరుతో వేరొక వ్యక్తిని పెట్టి వేలిముద్ర వేయించారని ఆరోపించారు. స్థానిక టిడిపి నేతల అండదండలతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వి.వి ప్రసాద్, స్పెషల్ ఆఫీసర్ కొల్లి గాయత్రి అక్రమంగా, అన్యాయంగా ఎన్నికల నిర్వహించారని ఆక్రోశం వెళ్లగక్కారు. దీనిపై న్యాయ పోరాటానికి సిద్ధమని తెలిపారు.

పోలిపల్లి సొసైటీ మాజీ చైర్మన్ మృతి

ప్రజాశక్తి-డెంకాడ



కంది సీతారాం(ఫైల్)

మండలంలోని అక్కివరం గ్రామానికి చెందిన పోలిపల్లి సొసైటీ మాజీ చైర్మన్ కంది సీతారాం అనారోగ్యంతో గురువారం రాత్రి మృతిచెందారు ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద చికిత్స పొందుతున్నారు. సీతారాంకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఓ కుమారుడు గ్రామంలో ప్రయివేట్ స్కూల్ నడుపుతున్నాడు. సీతారాం పోలిపల్లి సొసైటీ చైర్మన్‌తో పాటు గ్రామ సర్పంచ్ గాను, టిడిపి డెంకాడ మండల అధ్యక్షులుగాను రెండు పర్యాయాలు పనిచేశారు. పలువురు ప్రజా ప్రతినిధులు సీతారాం భౌతికకాయాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సందర్శించిన వారిలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖరరావు, ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు పతివాడ అప్పలనారాయణ, కంది సూర్యనారాయణ, టిడిపి సీనియర్ నాయకులు మహంతి చిన్నంనాయుడు, భోగాపురం, డెంకాడ మండలాల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, పల్లె భాస్కరరావు తదితరులు ఉన్నారు.

ఉద్యానానికి నాబార్డు ఊతం

ప్రజాశక్తి- మెంటాడ

గిరిప్రాంతాల్లో ఉద్యాన పంటల సాగుకు నాబార్డు ప్రోత్సాహం అందిస్తుందని నాబార్డు డిడిఎం టి.నాగార్జున తెలిపారు. శుక్రవారం మండలంలోని కొండపర్తి, సారాడవలస, ఆంద్ర, లోతుగెడ్డ గ్రామాల్లో నాబార్డు సహకారంతో సాగవుతున్న ఉద్యాన పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 300 మంది గిరిజన రైతుల ఎంపిక లక్ష్యం కాగా, తొలివిడతలో పై నాలుగు గ్రామాలకు చెందిన 50 మందికి 75 చొప్పున మామిడి, సీతాఫలం మొక్కలను పంపిణీ చేశామని చెప్పారు. లబ్ధిదారులు వాటి పెంపకంపై శ్రద్ధ చూపుతున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే ఐదేళ్లలో 300 మంది రైతులను ఎంపిక చేయాలన్న లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు. లబ్ధిదారుల సహకారం కూడా అవసరమని చెప్పారు. కొండ ప్రాంతాల్లో సాగుకు నీటి సమస్య తలెత్తుతోందని గిరిజనులు ఈ సందర్భంగా ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నీటి కుంటలను ఏర్పాటు చేయాలని కోరారు. ఉన్నతాధికారులతో చర్చిస్తామని డిడిఎం హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా లబ్దిదారులకు క్రిమి సంహారక మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో లోతుగడ్డ సర్పంచ్ భీమారావు, మాజీ ఉపసర్పంచ్ పైడితల్లి, బ్రీడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సుమన్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల రవాణాపై ప్రత్యేక నిఘా

రామభద్రపురం : బొబ్బిలి సబ్ డివిజన్ పరిధిలో మాదక ద్రవ్యాల రవాణా, వినియోగంపై ప్రత్యేక నిఘా వేసినట్లు డిఎస్‌పి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్లో శుక్రవారం బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావుతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. గంజాయి నిర్మూలనే ధ్యేయంగా బొబ్బిలి ప్రాంతంలోని పాత బొబ్బిలి, రామభద్రపురం మండలం కొట్టక్కి వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశంలో ఎస్ఐ వి.ప్రసాద్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని పెదతాడివాడ పంచాయతీ పరిధిలో ఉ ఊడికలపేటలో పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా నూతన చట్టాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సన్యాసినాయుడు మాట్లాడుతూ కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహశీల్దార్ బి.పద్మావతి, ఆర్ఐ, విఆర్ఒ అప్పలనాయుడు, ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి రామ్మూర్తి, గ్రామ పెద్దలు చిరంజీవి, రాజు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం : రాజ్యాంగం ప్రతీ పౌరుడికి హక్కులు కల్పించిందని తహశీల్దార్ ఎం. సురేష్ అన్నారు. భోగాపురంలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. పౌరహక్కులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అప్పయ్యమ్మ, ఎంపిడిఒ అప్పలనాయుడు, ఎస్ఐ సూర్యకుమారి ఇన్‌చార్జి ఇఒ సురేష్, ఆర్ఐ కిశోర్, విఆర్ఒ రామునాయుడు న్యాయవాది గురునాథ్, మాజీ ఎంపిటిసి గురువులు పాల్గొన్నారు.

రేగిడి : పౌర హక్కుల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని తహశీల్దార్ డి.ఎల్లారావు, ఇఒపిఆర్‌డి ఎవి సత్యనారాయణ, ఎఎస్ఐ రాజారావు అన్నారు. ఉంగరాడలో శుక్రవారం సర్పంచ్ చల్లా బుజంగరావు ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిలకు హక్కులు ఎన్నో ఉన్నాయని, వాటిని తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో విఆర్ఎ రాజు పాల్గొన్నారు.

పుష్పగిరిలో అంధత్వ నివారణ వారోత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని పుష్పగిరి కంటి ఆస్పత్రిలో 39వ అంధత్వ నివారణ వారోత్సవాలు శుక్రవారం జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు మాట్లాడుతూ కంటి విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. డాక్టర్ శివప్రసాద్, తారకేశ్వరరావు రాజేశ్వరరావు తదితరులు ప్రసంగించారు కార్యక్రమంలో పుష్పగిరి సిఇఒ రాజశేఖరం తదితరులు పాల్గొన్నారు.

లీకులు నివారించి సంపూర్ణంగా తాగునీరు

ప్రజాశక్తి-బొబ్బిలి

పైపులైన్ లీకులను నివారించి ప్రజలకు సంపూర్ణంగా తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ ఆదేశించారు. బలిజిపేట రోడ్డులో పైపులైన్ లీకేజీ నివారణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. మున్సిపాలిటీలో పైపులైన్ లీకులను పూర్తిగా నివారించాలని కోరారు. లీకులు నివారణతోనే ప్రజలకు సంపూర్ణంగా తాగునీరు సరఫరా చేయగలమని చెప్పారు. ఆయనతో కౌన్సిలర్లు ఉన్నారు.

కొండవెలగాడలో డ్రైడే

నెల్లిమర్ల : మండలంలోని కొండవెలగాడలో శుక్రవారం డ్రైడే కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ డిఎంహెచ్ఒ కె.రాణి ఆకస్మిక తనిఖీ చేశారు. వీధుల్లో పర్యటించి ప్రజలకు డ్రై డేపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యర్ర రమణ, పిహెచ్‌సి హెడ్ నర్సు రూతమ్మ, ఎఎన్ఎం అల్లు మాధవి తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : దోమల సంతతిని అరికట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఎస్.కోట సబ్ యూనిట్ ఆఫీసర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని బర్మా కాలనీలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి లార్వా నిర్మూలన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శంకర్, ఎఎన్ఎంలు, ఎంటిఎస్ రాజశేఖర్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ప్రజాశక్తి-వేపాడ

వేపాడ గ్రామానికి చెందిన రంభ అప్పారావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో ఆయనకు మన నేస్తం స్వచ్ఛంద సంస్థ సభ్యులు రూ.8500 వేలు అందజేశారు. ఎద్దు మట్టడంతో కాలు దెబ్బతిని మంచానికే పరిమితమైన నారప్పకు రూ.5 వేలు నగదు అందించారు.

కాలుష్య కారణాలను విశ్లేషించండి

కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా కేంద్రంలో వాయు కాలుష్యానికి కారణాలను విశ్లేషించి, నియంత్రణకు పకడ్బందీగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. నేషనల్ క్లీన్ ఎయిర్ కార్యక్రమం అమలుపై తమ ఛాంబర్‌లో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. దేశంలో వాయు కాలుష్యం ఎక్కువగా ఉన్న నగరాల జాబితాలో విజయనగరం కూడా ఉండటానికి గల కారణాలను కలెక్టర్ ఆరా తీశారు. వాయు కాలుష్యం ఎక్కువగా నమోదు అవుతుండటానికి మూల కారణాలను కనుగొనాలని సూచించారు. కాలుష్య కారణాలను గుర్తిస్తే, దాని నివారణ సులువు అవుతుందని, ఆ దిశగా ప్రయత్నం చేయాలన్నారు. ముఖ్యంగా వాయు కాలుష్యాన్ని నమోదు చేసే పరికరాల ప్రదేశాలను మార్చి, రీడింగ్‌లను నమోదు చేయాలన్నారు. ఇప్పటివరకు నమోదైన రీడింగులను విశ్లేషించాలన్నారు. నేషనల్ క్లీన్ ఎయిర్ కార్యక్రమం కింద ఇంతవరకు సుమారు రూ.4.5కోట్లు ఖర్చు చేశారన్నారు. దీనివల్ల వచ్చిన ఫలితాలను గమనించాలన్నారు. ఈ ఏడాది సుమారు రూ.2.65 కోట్ల ఖర్చుతో కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవడానికి తగిన ప్రణాళికను రూపొందించాలని చెప్పారు. ముఖ్యంగా విస్తతంగా మొక్కలను నాటడం ద్వారా కాలుష్యాన్ని చాలావరకు అరికట్టవచ్చునని అన్నారు. విద్యుత్ వాహనాలను వినియోగాన్ని ప్రోత్సహించాలని, దీనికోసం ఛార్జింగ్ పాయింట్లను ఎక్కువగా ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో పొల్యూషన్ ఇంజనీర్ సరిత, వ్యవసాయశాఖ జెడి విటి రామారావు, ఉద్యానశాఖ డిడి జమదగ్ని, డిఎస్ఒ మధుసూదనరావు, మున్సిపల్, పోలీస్, పరిశ్రమలు తదితర శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల షాపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఆహార ఉత్పత్తులతో ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చునని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. శుక్రవారం పట్టణంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల షాపును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యంగా ఉండగలమని చెప్పారు. ప్రకృతి వ్యవసాయం చేసేందుకు రైతులు, ప్రకృతి ఆహార ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ప్రజలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో డిపిఎం ఆనందరావు, వ్యవసాయ శాఖ ఎడి ఎం.శ్యామసుందర్, షాపు యజమాని ఎం.గౌరవమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని ఎమ్మెల్యే బేబినాయన కోరారు. వనం-మనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాణిమల్లమ్మదేవి పార్కు గట్టుపై మొక్కలు నాటారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించేందుకు మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, కమిషనర్ ఎల్.రామలక్ష్మి, కౌన్సిలర్లు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేకుండా చర్యలు

రామభద్రపురం : ఎరువుల కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే బేబినాయన తెలిపారు. మండల పరిధిలోని బూసాయవలస గ్రామంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. యూరియా, డిఎపి, అన్ని రకాల ఎరువులు పూర్తి నిల్వలు ఉండే విధంగా వ్యవసాయాధికారులతో సంప్రదింపులు చేశామన్నారు. ఇరిగేషన్ పనులు చేపట్టడానికి అంచనాలు వేయాలని సంబంధిత అధికారులను ఆదేశించామని తెలిపారు. నియోజకవర్గంలో ఉన్న పెండింగ్ సమస్యలు పరిష్కరించడానికి ఇప్పటికే జిల్లా కలెక్టర్‌తో చర్చించినట్లు తెలిపారు. సమావేశంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు మడక తిరుపతిరావు, నాయకులు దేవర తిరుపతిరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో పర్యటించిన కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో వివిధ ప్రాంతాల్లో కమిషనర్ పి.నల్లనయ్య పర్యటించి ఆయా ప్రాంతాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికై దిశా నిర్దేశం చేశారు. శుక్రవారం ఉదయం రాజీవ్ స్టేడియం ఎదురుగా ఉన్న వాహన డిపోను సందర్శించారు. చెత్త తరలించే వాహనాల పరిస్థితి పరిశీలించారు. మరమ్మత్తులకు గురైన వాహనాలను తక్షణమే సరి చేయించాలని సిబ్బందికి ఆదేశించారు. అక్కడ సీసీ డ్రైన్ తోపాటు సిమెంటు ఫ్లోరింగ్ ను కూడా ఏర్పాటు చేసే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆ తర్వాత పాలాస్పత్రి వద్ద పర్యటించి మస్తర్ పాయింట్ కు తక్షణమే మరమ్మతులు చేయించాలన్నారు. స్థానిక నెహ్రూ పార్కులో ఆర్ఓ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. పార్క్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి చొరవ చూపాలన్నారు. ఆ తర్వాత మూడులాంతర్ల నుండి అంబటి సత్రం వరకు ఉన్న కాలువలపై పలకలను తొలగించి కాలువలలో పేరుకుపోయిన పూడికలను తొలగించాలన్నారు. నగరంలో ఎక్కడా పోస్టర్లు, గోడ రాతలు ఉండరాదన్నారు. ఇప్పటికే ఉన్న వాటిని తక్షణమే తొలగించాలన్నారు.

మంత్రిని కలిసిన కమిషనర్ నల్లనయ్య

రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలశాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను నగరపాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మంత్రి స్వగృహానికి వెళ్లి దుశ్శాలువతో సత్కరించి, మొక్కను బహుకరించారు.



మంత్రికి మొక్క అందజేస్తున్న కమిషనర్ నల్లనయ్య



ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్న అధికారులు

తూతూ మంత్రంగా ప్రజాభిప్రాయ సేకరణ

స్థానికుల నుంచి స్పందన కరువు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కొలికిపాలెం వద్ద జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, పర్యావరణ శాఖ ఇఇ ఆధ్వర్యాన చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ తూతూ మంత్రంగా సాగింది. మండలంలోని వావిలపాడు పంచాయతీ పెదదుంగాడ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 7లో ఉన్న కొండలో రోడ్డు మెటల్, బిల్డింగ్ స్టోన్ తవ్వకానికి సంబంధించి ఈ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. నాయకులు. ఎన్‌జిఒ సంఘాల ప్రతినిధులు మినహా స్థానికులు అంతంత మాత్రంగా హాజరయ్యారు. గతంలో చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణల్లో క్వారీ యజమానులు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ నెరవేర్చకపోవడం, అటు పర్యావరణ శాఖ, ఇటు రెవెన్యూ శాఖ అభ్యంతరాలు తెలపకపోవడంతో గ్రామస్తుల నుంచి స్పందన కరువైంది. స్థానికుల అభిప్రాయాలు కాకుండా క్వారీ యజమానితో బేరం కుదుర్చుకొని అనుమతులు ఇస్తున్నారనేది గ్రామస్తుల ఆరోపణ. స్థానికుల ఇబ్బందులను గుర్తించకుండా ఇటువంటి క్వారీలకు అనుమతులు ఇస్తే సమీప ప్రాంతాలలో నివసిస్తున్న అమాయక గిరిజనులకు తీవ్ర ఇబ్బందులు తప్పవని ఆందోళన చెందుతున్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ సన్యాసినాయుడు, ఎస్ఐ కె.రాజేష్ పాల్గొన్నారు.

కెజిబివి పనుల్లో కదలిక!

పరిశీలించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ శుక్రవారం పరిశీలించారు. కెజిబివిలో 11 గదుల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. అక్కడ ఇరుకు గదుల్లో చదువుతున్న బాలికలకు ఈ గదులు పూర్తయితే ఇబ్బందులు తొలగిపోతాయి. కానీ మధ్యలో నిర్మాణాలు ఆగిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు ఇటీవల విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం అందించారు. అందుకు స్పందించిన మంత్రి జిల్లా కలెక్టర్ అంబేద్కర్‌కి ఆదేశాలు జారీచేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపిడిఒ పట్నాయక్ శుక్రవారం కెజిబివిని పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న గదులను, ప్రస్తుతం విద్యార్థులు ఇరుకు గదుల్లో చదువుతున్న పొటోలను తీసి, కలెక్టర్‌కు పంపించారు. కెవిజివిలో అదనపు తరగతి గదుల పనులు త్వరగా పూర్తయితే విద్యార్థులకు ఇబ్బందులు తొలగుతాయని సామాజిక కార్యకర్త అప్పారావు ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఎస్ఒ కిరణ్మయి పాల్గొన్నారు.

మట్టివినాయక విగ్రహాలు పంపిణీ

ప్రజాశక్తి-బొబ్బిలి

జల కాలుష్యాన్ని నివారించేందుకు మట్టివినాయక విగ్రహాలకు పూజలు చేయాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సత్యంనాయుడు కోరారు. పర్యావరణ పరిరక్షణకు మట్టివినాయక విగ్రహాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారీస్ విగ్రహాలతో జల, వాయు కాలుష్యం ఏర్పడి జీవ మనుగడకు ప్రమాదంగా మారుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు మట్టివినాయక విగ్రహాలను వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు ప్రసన్నకుమార్, మండల అధ్యక్షులు కె.కృష్ణదాస్, మండల ప్రధాన కార్యదర్శి ఆనంద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కరాటేలో కొత్తవలస విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కొత్తవలస

విజయనగరంలో రాజీవ్ క్రీడా స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి కరాటే పోటీలలో కొత్తవలసకు చెందిన ఒకినోవా విద్యార్థులు గెలిపొందారు. ఈ పోటీల్లో ఆయా విభాగాల్లో ఇ.దేవకీ లతా, కె.జయశ్రీ, పి.సాయిజగన్, కె.లక్ష్మి దీపక్ మొదటి స్థానం, ఇ.లక్ష్మి ప్రసన్న రెండో స్థానం సాధించారని కోచ్ కర్రి సూర్య నూకరాజు తెలిపారు. వీరికి కలెక్టర్ బిఆర్.అంబేద్కర్, డిఇఒ ప్రేమ్‌కుమార్, డిఎస్‌డిఒ వెంకటేశ్వరరావు బహుమతులు అందజేశారు.

నేరాలు ఘోరాలు

కలువ పూల కోసం దిగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

కలువ పూల కోసం చెరువులో దిగి సోమయాజుల రమణ(48) మృతి చెందాడు. సిఐ విఎన్ మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని మనసు వీధికి చెందిన రమణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతానికి కలవు పూలు అమ్మేందుకు మున్సబ్‌వీధిఒ శివారున ఉన్న జగన్నాథ్ చెరువులో దిగాడు. ఊబిలో చిక్కుకుపోయి మృతి చెందాడు. రమణ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా చెరువు గట్టుపై అతని బట్టలు కనిపించాయని, కొద్దిసేపటికి రమణ మతదేహం కూడా చెరువులో తేలియాడిందని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-చీపురుపల్లి

చీపురుపల్లి రెవిన్యూ డివిజన్ కార్యాలయానికి సమీపంలో ఉన్న గెడ్డలో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహన్ని పోలీసులు గుర్తించారు. పశువుల కాపరులు ఇచ్చిన సమాచారంతో సిఐ శంకరరావు, ఎస్ఐ కుమార్‌నాయుడు అక్కడి చేరుకున్నారు. కొన్ని రోజుల కిందట చనిపోయి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. చర్మం పూర్తిగా లేదని, కపాలం మాత్రమే ఉందని ఎస్ఐ తెలిపారు. క్లూస్ టీంకి సమాచారం అందించామని చెప్పారు.

రైల్వే ట్రాక్‌పై మరొకరు..

విజయనగరం కోట : విజయనగరం రైల్వే స్టేషన్‌లోని రైల్వేట్రాక్ పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు రైల్వే పోలీసులు గుర్తించారు. అతడి వయసు సుమారు 35 నుండి 40ఏళ్లు ఉండవచ్చునని,లైట్ పింక్ కలర్ టీ షర్ట్, గ్రీన్ కలర్ గడుల లుంగి ధరించినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 9490617089 నెంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి శ్రీనివాసరావు

గంజాయి కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-బొబ్బిలి

గంజాయి కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు డిఎస్‌పి పి.శ్రీనివాసరావు చెప్పారు. స్థానిక పోలీస్ స్టేషన్లో శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన జె.సీతారాం, జె.లక్ష్మణరావు సుంకి ప్రాంతం నుంచి బొబ్బిలి గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చిందన్నారు. దీంతో టిబిఆర్ థియేటర్ ఎదురుగా శ్మశానం వద్ద అనుమానాస్పదంగా తిరగడంతో గమనించి పట్టుకున్నట్లు తెలిపారు. అరెస్టు చేసి ఇద్దరు నుంచి 16.05 కిలోల గంజాయి సీజ్ చేసినట్లు చెప్పారు. గత నెల 16న గంజాయి కేసులో ఐదుగురు నిందితులను, మరో ముగ్గురు మైనర్లను అరెస్టు చేసి 16. 595 కిలోల గంజాయి సీజ్ చేశామన్నారు. ఈ కేసు విచారణలో మరో ఇద్దరిని అరెస్టు చేశామని చెప్పారు. గంజాయి నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గంజాయి కేసును ఛేదించిన పట్టణ సిఐ కె.సతీష్ కుమార్, ఎస్ఐ లోవరాజును, కానిస్టేబుళ్లను డిఎస్‌పి అభినందించారు.

ఇంటర్ విద్యార్థికి అస్వస్థత

ప్రజాశక్తి- మెంటాడ

పెదమేడపల్లి మోడల్ స్కూల్లో ఇంటర్ విద్యార్థి నర్మద అస్వస్థతకు గురైంది. శుక్రవారం మధ్యాహ్నం భోజన అనంతరం వాంతులతో పాటు ఫిట్స్ రావడంతో పాఠశాల సిబ్బంది చల్లపేట పిహెచ్‌సికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం గజపతినగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యానికి విద్యార్థిని సహకరించకపోవడతో రిఫర్ చేసినట్లు పిహెచ్‌సి వైద్యులు జిలానీ భాషా చెప్పారు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు.

నేడు పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద సెప్టెంబరుకు సంబంధించిన సామాజిక ఫించను మొత్తాలను లబ్ధిదారులకు శనివారం వారి ఇళ్ల వద్దనే అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. సెప్టెంబరులో 15 విభాగాలకు చెందిన 2,79,361 మంది ఫించనుదారులకు రూ.116.32 కోట్లను అందించేందుకు శుక్రవారంనాడే ఆయా బ్యాంకుల నుంచి నగదు విడిపించి ఫించను పంపిణీచేసే అధికారులకు అందజేసినట్లు తెలిపారు. సెప్టెంబరు 1వ తేదీ ఆదివారం వచ్చినందున ఒకరోజు ముందుగానే పింఛనుపంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. పింఛన్ల పంపిణీకోసం 5,339 మంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను, గ్రామస్థాయి ఉద్యోగులను నియమించామని వెల్లడించారు. ఫించనుదారులందరికీ వందశాతం శనివారం నాడే అందించేందుకు ప్రయత్నిస్తారని, ఎవరైనా ఆరోజు అందుబాటులో లేనట్లయితే సెప్టెంబరు 2వ తేదీన అందజేస్తారని పేర్కొన్నారు.

సింగిల్ విండో విధానంతో గణేష్ ఉత్సవాలకు అనుమతులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

వినాయక ఉత్సవాలకు సంబంధించిన అన్ని రకాల అనుమతులను మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సింగిల్ విండో విధానం ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వచ్చి, సులభతరం చేసిందని జిల్లా ఎస్‌పి వకుల్ జిందల్ తెలిపారు. ఈ విధానంతో ప్రజలు సులభంగా గణేష్ ఉత్సవాల నిర్వహణ, మండపాల ఏర్పాటు, ఊరేగింపులు, నిమర్జనంలకు మీ సేవలో చలానా రుసుంను చెల్లించి, నిరభ్యంతర పత్రం, క్యూఆర్ కోడ్‌ను పొందవచ్చునని తెలిపాఉ.. జిల్లాలో గణేష్ ఉత్సవాలను నిర్వహించదలిచివారు ఈ సింగిల్ విండో విధానంలో వివరాలను పూర్తి చేసి, మీ సేవలో చలాన రుసుం చెల్లించి, అనుమతులు పొందాలని, అనుమతులను, క్యూఆర్ కోడ్‌ను లేమినేషను చేసి, ఉత్సవాలను నిర్వహించే పందిరిలో తనిఖీలకు వచ్చే అధికారులకు చూపాలని తెలిపారు. అనుమతులు పొందగోరేవారు ముందుగా https://ganeshutsav.net లో దరఖాస్తు చేయాలని తెలిపారు.

హైడ్రా తరహాలో ఆక్రమణలు తొలగించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన హైడ్రా తరహాలో ఎపిలో చెరువులు, సాగునీటి కాలువలు ఆక్రమణపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి మువ్వల శ్రీనివాసరావు కోరారు. తెలంగాణలో చెరువులు, ప్రభుత్వ భూములు, సాగునీటి కాలువల ఆక్రమణలు తొలగింపునకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైడ్రాను ఏర్పాటు చేశారని తెలిపారు. మున్సిపాలిటీలో చెరువులు, ప్రభుత్వ భూములను ఆక్రమించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటున్నా అధికార యంత్రాంగం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కూడా ఆక్రమణల తొలగింపునకు పటిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విశాఖ రైల్వేజోన్ ప్రకటించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

రాష్ట్ర విభజన హామీలలో భాగంగా విశాఖ రైల్వే జోన్ ప్రకటించాలని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్ ఒక ప్రకటనలో కేంద్రాన్ని డిమాండ్ చేశారు. విశాఖ రైల్వే జోన్ ఇస్తామని విభజన హామీల్లో ఉన్నప్పటికీ అమలు చేయకపోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఒడిశా రాష్ట్రంలోని రాయగడ కేంద్రంగా రైల్వేజోన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని, రాష్ట్ర మంత్రులు, ఎమ్‌పిలు, కేంద్ర మంత్రులు.. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒడిశాలో బిజెపి ప్రభుత్వం ఉండడం వల్ల రైల్వే జోన్ ఏర్పాటు చేస్తున్నారని, ఎపికి అన్యాయం జరుగుతున్నా మన పాలకులు ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు.

విద్యుత్తు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-రేగిడి

విద్యుత్తు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని తెలుగు నాడు విద్యుత్ ఉద్యోగుల సంఘం రాజాం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శి సిహెచ్ ప్రసాదరావు, కొమ్ము శ్రీరాములనాయుడు, ఉపాధ్యక్షులు జి.వాసుదేవరావు అన్నారు. రాజాం డివిజన్ సంబంధించి విద్యుత్ ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఎన్నిక పత్రాలను విద్యుత్తు శాఖ అధికారులు అందజేశారు. ట్రెజరర్‌గా ఎస్.రాంబాబు, బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీగా కె.సత్యనారాయణ ఎన్నికయ్యారు.